క్లుప్తంగా

సమస్యలు పట్టవా!

సీతంపేట: మండలంలోని సమస్యలను అధికారులు పట్టించుకోరా అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు ప్రశ్నించారు. సీఐటీయూ కార్యాలయంలో ఆ పార్టీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమంపై మండల అభివృద్ధి అధికారి పర్యవేక్షణ కరువైందన్నారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు సగం కూడా నిర్మాణం జరగలేదన్నారు. నిర్మాణం పూర్తయిన వాటిని కూడా ప్రారంభించలేని పరిస్థితి ఉందన్నారు. జనరల్ బాడీలో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు సైతం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న జలజీవన్, రోడ్డు పనులు దృష్టి సారించడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు భాస్కరరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు



వీఆర్‌ఓల నుంచి ఇళ్ల స్థలాల వివరాలు సేకరిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

వీరఘట్టం: అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇళ్ల స్థలాలు అందజేస్తామని తహసీల్దార్ చందక సత్యనారాయణ అన్నారు. రెండవ విడత పంపిణీ చేయనున్న ఇళ్ల స్థలాల లబ్ధిదారుల వివరాలను గురువారం ఆయన వీఆర్‌ఓల నుంచి సేకరించారు. వీరఘట్టం మేజరు పంచాయతీకి సంబంధించి రెండవ విడతలో లబ్ధిదారులకు మరియగిరి సమీపంలో ఇళ్లు ఇచ్చేందుకు ప్రతిపాదనలు చేశామన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే మరియగిరి సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని చదును చేసి అర్హులైన పేదలకు అప్పగిస్తామన్నారు.

మొబైల్ బుక్‌స్టోర్ ప్రారంభం



బుక్ స్టోర్‌ను ప్రారంభిస్తున్న సీఐ

పాలకొండ: విశాలాంధ్ర మొబైల్ బుక్ స్టోర్‌ను పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా సీఐ ఎం.చంద్రమౌళి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా మంచి విజ్ఞానం పొందగలమని తెలిపారు. అత్యంత విలువైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వైఎస్సార్‌సీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు వెలమల మన్మధరావు, కౌన్సిలర్లు కడగల రమణ, బాసూరు కాంతారావు, కిల్లారి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా...



ఆడుదాం.. ఆంధ్రా పోటీల్లో ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

కురుపాం: ఆడుదాం.. ఆంధ్రా క్రీడా పోటీలు నియోజకవర్గ స్థాయిలో ఉల్లాసంగా.. ఉత్సాహంగా జరుగుతున్నాయి. కురుపాం నియోజకవర్గ పరిధిలో ఉన్న ఐదు మండలాలకు చెందిన క్రీడాకారులు గురువారం జరిగిన పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ తదితర పోటీలు జరిగాయి. వివిధ మండలాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు.

వైద్య సేవలు పొందాలి

పాలకొండ రూరల్: దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న బాధితులకు ప్రభుత్వ ఆస్పత్రి ద్వారా అందిస్తున్న సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఏరియా ఆస్పత్రి సూపరింటిండెంట్ జి.నాగభూషణరావు అన్నారు. ఏరియా ఆస్పత్రి పరిధిలో హెచ్ఐవీ జీవిస్తున్న 195 మందికి వైరల్ లోడ్ పరీక్షలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదిలో ఒకసారి ఈ తరహా పరీక్షలు చేయడం ద్వారా బాధితుని తాజా ఆరోగ్య స్థితిగతులు తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో ఆరోగ్యం మెరుగు పడేందుకు అవసరమైన మందులు, జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. వైద్య సిబ్బంది శ్రీహరినాయుడు, ప్రసాదరావు, గోవిందరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు సికిల్ సెల్ పరీక్షలు

బలిజిపేట: పౌష్టికాహారం, రక్తం తక్కువ ఉన్న (సికిల్‌సెల్) వ్యాధికి సంబంధించి విద్యార్థులకు పాఠశాలల్లో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బలిజిపేట మండలంలోని గంగాడ, గలావల్లి ప్రాథమిక పాఠశాలల్లో వైద్య శాఖ సిబ్బంది విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు వైద్య శాఖ సిబ్బంది పాఠశాలలో విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించి వాటి ఫలితాలను వైద్యశాఖకు పంపించనున్నామని అధికారులు తెలిపారు. భవిష్యత్తులో రక్తం తక్కువగా ఉండే విద్యార్థులకు అవసరమైన వైద్యసేవలు అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయని చెప్పారు. కార్యక్రమంలో వైద్యశాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోసగాడు చంద్రబాబును నమ్మొద్దు



వైఎస్సార్ ఆసరా చెక్కును డ్వాక్రా సభ్యులకు అందజేస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

- వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయని పచ్చి మోసగాడు చంద్రబాబునాయుడు అని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. స్థానిక బీఎస్ఆర్ కళింగ వైశ్య కల్యాణ మండపం వద్ద వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆసరా కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో డ్వాక్రా మహిళల రుణాలను మాఫీ చేస్తానని, బ్యాంకుల్లో బంగారాలు విడిపిస్తానని మహిళలను నమ్మించి ఓట్లు వేయించుకున్న చంద్రబాబు గెలిచాక ఆ హామీలు అమలు చేయకుండా మోసం చేశారని గుర్తుచేశారు. ఐదేళ్ల అధికారం చేపట్టి 2019లో పసుపు కుంకుమ పేరుతో మళ్లీ మోసం చేశారన్నారు. 2019 ఎన్నికల సమయంలో జగనన్న ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి మహిళల ఆర్థికాభివృద్ధికి అండగా నిలిచారన్నారు. ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చి మాట తప్పని నేతగా ప్రజల్లో నిలిచారని కొనియాడారు. మహిళల సంక్షేమం కోసం వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, అమ్మఒడి, జగన్న తోడు, చేదోడు వంటి పథకాలతో పాటు రైతు భరోసా, వాహనమిత్ర, ఇంటింటికి రేషన్, ఇంటి వద్దకే వైద్యం(జగనన్న ఆరోగ్య సురక్ష) వంటి అనేక పథకాలను అమలు పరుస్తున్నారన్నారు. గతంలో ఏ పనులు కావాలన్నా మండల కేంద్రానికి, అధికారులు, ఎమ్మెల్యేల వద్దకు వెళ్లాల్సి వచ్చేదని పేర్కొన్నారు. జగనన్న వచ్చాక గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి వద్దకే వచ్చి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వానికి, జగనన్న ప్రభుత్వానికి తేడాను మహిళలంతా గమనించాలన్నారు. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తుండగా చంద్రబాబు టీం మళ్లీ మోసం చేసేందుకు ఇంటికో కారు.. ఇంటికో కేజీ బంగారం ఇస్తామనే హామీలతో ప్రజల ముందుకొస్తున్నారని.. అటువంటి మోసగాళ్లను నమ్మ మోసపోవద్దని హితవు పలికారు. ఇచ్చిన మాట ప్రకారం హామీలన్నీ అమలు చేసి ఇంటికి పెద్ద కొడుకుగా నిలబడ్డ జగనన్నను మరలా గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పిలుపునిచ్చారు. అనంతరం గుమ్మలక్ష్మీపురం మండలంలోని 565 స్వయం సహాయక సంఘాల్లోని 6317 మంది మహిళా సభ్యులకు నాల్గో విడతగా వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ప్రభుత్వం విడుదల చేసిన రూ.2,15,23,881 కోట్ల చెక్కుతో పాటు, మండలంలోని 65 స్వయం సహాయక సంఘాలకు చెందిన 789 మంది సభ్యులకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ద్వారా ప్రభుత్వం విడుదల చేసిన రూ.2,25,50,000ల చెక్కును సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంబురుక దీనమయ్య, జెడ్పీటీసీ మండంగి రాధిక, వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, ఎస్సీ, ఎస్టీ సెల్ మండల కన్వీనర్లు సామల మాధవరావు, తోయక గోపాల్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అడ్డాకుల చిన్నారావు, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎన్.గోపాల్, పార్టీ శ్రేణులతో పాటు సర్పంచులు, ఎంపీటీసీలు, ఏపీఎం ఆదయ్య, ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సాయం మరువం



మాది అరుణోదయ మహిళ సంఘం. 10 మంది సభ్యులం. వైఎస్సార్ ఆసరా ద్వారా మా సంఘానికి ప్రతి ఏటా రూ.55వేలు చొప్పున వైఎస్సార్ ఆసరా వచ్చింది. ప్రభుత్వం మంజూరు చేసిన ఆసరా సాయం ద్వారా సంఘ సభ్యులంతా జీవన ఉపాధి మెరుగుపరుచుకుంటున్నాం. ముఖ్యమంత్రి జగనన్నకు రుణపడి ఉంటాం.

– రెడ్డి రాజేశ్వరి, అరుణోదయ మహిళ సంఘం, గుమ్మలక్ష్మీపురం

రుణం మాఫీ అయ్యింది..



ఎన్నికల ముందు మా సంఘంలోని 13 మంది సభ్యులం బ్యాంకు లింకేజి రుణం రూ.5లక్షలు అప్పు తీసుకున్నాం. ప్రభుత్వం ఏటా రూ.1.25 లక్షలు చొప్పున ఆసరా పథకం ద్వారా నగుదు అందించింది. దీంతో నాలుగు విడతల్లో మా రుణం మొత్తం మాఫీ అయింది. సంఘ సభ్యులంతా ఆర్థికంగా ఎదుగుతున్నాం. – పాలక సులోచన, భవాని మహిళ సంఘం, తాడికొండ

ఆసరా ఆదుకుంది...



ఆసరా మా కుటుంబాన్ని ఆదుకుంది. వైఎస్సార్ ఆసరా మూడు విడతల్లో సుమారు రూ.50వేలు వచ్చింది. బ్యాంకు లింకేజి తీసుకుని కిరాణా షాపును పెట్టాను. దీనిపై బాగానే వ్యాపారం సాగుతుంది. రోజువారీ ఇంటి ఖర్చులు పోను నెలకు రూ.12,500ల వరకు ఆదాయం వస్తుంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– కొండగొర్రి సోభిత, రెల్లిగూడ, గుమ్మలక్ష్మీపురం

వైఎస్సార్ ఆసరా చెక్కును సభ్యులకు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్



సంక్షేమ రథసారథి జగనన్న

- 'వైఎస్సార్ ఆసరా'లో ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ రూరల్: సంక్షేమ రథసారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. వీరఘట్టం రహదారిలో మార్కెట్ కమిటీ సమీపంలో వైఎస్సార్ ఆసరా నాల్గో విడత నిధుల మంజూరుకు సంబంధించి ప్రత్యేక కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడుతూ గతంలో టీడీపీ హయాంలో ఆ పార్టీ వారికే సంక్షేమ ఫలాలు అందాయన్నారు. జన్మభూమి కమిటీల ద్వారా ఏకపక్షంగా సంక్షేమ పథకాలు పంపిణీ చేశారని ఆరోపించారు. జగనన్న పాలనలో పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికి అందుతున్నాయన్నారు. జగనన్న ప్రభుత్వం ప్రతీ కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందిందన్నారు. సంక్షేమ పథకాలు వలంటీర్ల ద్వారా ఇంటికే వెళ్తున్నాయన్నారు. ముఖ్యంగా మహిళా అభ్యున్నతికి కట్టుబడి అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు.

నాలుగు విడతల్లో...

మండల పరిధిలో 938 ఎస్‌హెచ్‌జీలు ఉండగా వీటిలో 10వేల 787 మంది సభ్యులు ఉన్నట్టు ఎంఎంఎస్ అధ్యక్షురాలు కల్పన సభ దృష్టికి తీసుకువచ్చారు. వీరికి సంబంధించి రూ.21కోట్ల 33లక్షల 56వేల పైచిలుకు నిధులు ఆసరా ప్రాప్తికి నాలుగు విడతల్లో సభ్యుల బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్టు వివరించారు. ఈ విధానంతో అప్పుల్లో కూరుకుపోయిన తమ కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అయ్యాయన్నారు. జగనన్న బటన్ నొక్కి అక్కచెల్లెమ్మల ఖాతాకు సంక్షేమ నిధులు అందిస్తూ అండగా నిలుస్తున్నారని, రానున్న రోజుల్లో ఇక్కడ ఈవీఎంలో బటన్ నొక్కి మేమంతా జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేస్తామని నినదించారు. కార్యక్రమంలో ఎంపీపీ బొమ్మాళి భాను, వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్, లోలుగు విశ్వేశరరావు, రణస్థలం రాంబాబు, నల్లి శివప్రసాద్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమాన్ని ఎంపీడీఓ డొంక త్రినాథులు, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం సూరమ్మ, సీసీలు పర్యవేక్షించారు. అనంతరం జగనన్నకు సభ్యులు, ప్రజా ప్రతినిధులు క్షీరాభిషేకం చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



ఆసరా కార్యక్రమంలో పాల్గొన్న డ్వాక్రా సంఘాల సభ్యులు

ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు

- ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వం ప్రజల వద్దకే ప్రభుత్వసేవలు అందిస్తుందని ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని కొండాపురం గ్రామంలో రూ.50లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, సచివాలయ భవనాలను వారు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వ భవనాలు అందుబాటులోనకి తీసుకురావడం ద్వారా ప్రజలు మండల కేంద్రాల చుట్టూ తిరగకుండా సేవలు అందిస్తున్నారని తెలిపారు. సచివాలయ వ్యవస్థతో నేరుగా ప్రజల వద్దనే అధికారులు ఉంటున్నారని వివరించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పంటల కొనుగోలు, తదితర సేవలు అందుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.భాను, వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాషరావు, వాకముడి అనిల్‌కుమార్, వ్యవసాయ సలహ మండలి చైర్మన్ రణస్థలం రాంబాబు, సభ్యులు శాసుబిల్లి జనార్ధనరావు, గ్రామ సర్పంచ్ రాయి వనజ, ఎంపీటీసీ కరణం అమరజ్యోతి, గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కొండాపురంలో ఆర్‌బీకే ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

రావుపల్లిలో గడ్డివాములు దగ్ధం

గరుగుబిల్లి: మండలంలోని రావుపల్లి గ్రామంలో గురువారం ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన గుంట్రెడ్డి గౌరునాయుడు, శ్రీనివాసరావుకు చెందిన సుమారు పది ఎకరాలకు సంబంధించిన వరి గడ్డివాములు కాలిపోయాయి. అగ్నికీలలు ఎగసిపడడంతో పరిసర ప్రాంతంలో వున్న మామిడి చెట్లు పాక్షికంగా కాలిపోయాయి. ప్రమాద సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ జివి.జనార్దన్, వీఆర్‌ఓ టి.శ్రీనివాసరావు ప్రమాద ప్రాంతాన్ని సందర్శించి జరిగిన నష్టంపై అంచనా వేశారు. ప్రమాద విషయం తెలుసుకొన్న పార్వతీపురం అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపుచేశారు.

వేతనదారుల సంఖ్యను పెంచాలి

గరుగుబిల్లి: ఉపాధి హామీ పనుల్లో వేతనదారుల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ పనులు దాదాపు ముగిసినందున ఉపాధి పనులను విస్తృతంగా చేపట్టాలన్నారు. పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. పనుల్లో పాల్గొనే వారికి మాత్రమే మస్టర్లను వేయాలని సూచించారు. తొలిత రైతులకు ఉపయోగపడే పనులను గుర్తించి వేతనదారులు పనుల్లో పాల్గొనేటట్లు చూడాలన్నారు. పనుల కల్పనలో అలసత్వం వహిస్తే క్షేత్ర సహాయకులపై చర్యలు తప్పవన్నారు. ఏపీఓ గౌరీనాధ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ పైడితల్లి

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక అలంకరణ



భక్తులకు దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నది ఒడ్డున వేంచేసిన వేణుగోపాలస్వామి ఆలయప్రాంగణంలో వెలసిన లక్ష్మీనృసింహ స్వామి ప్రత్యేక పుష్ప,పత్రాల అలంకరణలో భక్తులకు గురువారం దర్శనమిచ్చారు. గురువారం స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడం వల్ల ఆలయ అర్చకులు స్వామివారిని అలంకరించారు. ఆలయఅర్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో భక్తులందరూ వేకువజామునుంచి పూజలు నిర్వహించారు. అలాగే స్వామివారికి మరికొంత మంది భక్తులు క్షీరాభిషేకాలు,కుంకుమపూజలు,ఆలయ ప్రదక్షిణ చేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు దూరప్రాంతాల నుంచి ఉపవాసాలతో వచ్చిన భక్తులకు పూజలనంతరం తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు

భామిని: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పిస్తామని ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి అన్నారు. మండలంలోని సింగిడి, బురుజోల పోలింగ్ కేంద్రాలను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించాలని సూచించారు. సింగిడి పోలింగ్ కేంద్రం వద్ద వెంటనే మరుగుదొడ్డి నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దార్ నీలాపు అప్పారావు, ఏఈలు జి.గౌరీశంకర్, అలికాన సందీప్, సర్పంచ్ మడపాన కేశవ, బీఎల్‌ఓలు ఉన్నారు.



బురుజోల పోలింగ్ కేంద్రం వద్ద అధికారులకు సూచనలిస్తున్న పీఓ కల్పనాకుమారి

త్రుటిలో తప్పిన ప్రమాదం

పాలకొండ రూరల్: స్థానిక అగ్నిమాపక కేంద్రం మలుపు వద్ద చెరుకు లోడుతో పట్టణంలోకి వస్తున్న లారీ అదుపు తప్పి పక్కనే ఉన్న చిరు వ్యాపారుల బళ్లపై ఒరిగిపోయింది. ఈ సమయంలో వ్యాపారులు అక్కడ లేకపోవటంతో పెను ప్రమాదం తప్పింది. మలుపు వద్ద వాహనం ఒరిగిపోవటం, చెరకు రోడ్డుపై పడటంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేయడంతో పాటు సహాయక చర్యలు చేపట్టి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించినట్టు ఎస్ఐ ప్రశాంత్‌కుమార్ తెలిపారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

కురుపాం: వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేసి పదవీ విరమణ పొందిన పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెన్షనర్లు గురువారం నిరసన చేపట్టారు . ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు టి.పాండురంగారావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం పెన్షనర్లకు ఆదుకోవాలన్నారు. 11వ పీఆర్‌సీ ఏరియర్స్ వెంటనే చెల్లించాలని, హెల్త్ కార్డు ద్వారా అన్ని వ్యాధులకు అన్ని గుర్తింపు పొందిన ఆసుపత్రిల్లో వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని పెన్షనర్లు అందించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన పెన్షనర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు పాండు రంగారావు

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం



భామిని: ఓటర్ల దినోత్సవ ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్ అప్పారావు, బీఎల్‌ఓలు



గరుగుబిల్లిలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్ జనార్దన్, రెవెన్యూ సిబ్బంది



వీరఘట్టం: ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ కుమారస్వామి



కురుపాం: మండల కేంద్రంలో నిర్వహించిన ఓటర్ల దినోత్సవంలో మాట్లాడుతున్న ఆర్‌డీఓ లావణ్య



పాలకొండ: ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్ తదితరులు

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం వంటిదని పలువురు అధికారులు పేర్కొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని శుక్రవారం పలుచోట్ల నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, విద్యార్థులు కలసి ర్యాలీలు నిర్వహించారు. ఓటర్లను చైతన్యపరిచే విధంగా నినాదాలు చేశారు. కార్యక్రమాల్లో అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్

ప్రజల చెంతకే ప్రభుత్వ పాలన

- పలు ప్రభుత్వ భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

గరుగుబిల్లి

ప్రజల చెంతకే ప్రభుత్వ పాలన అందించేందుకు గ్రామ సచివాలయ వ్యవస్థను జగనన్న ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని సంతోషపురం, ఉద్దవోలు గ్రామాలలో చెరో రూ.40.36 లక్షలతో నిర్మించిన రెండు గ్రామ సచివాలయ భవన నిర్మాణాలను, సంతోషపురం, పెద్దూరు, ఉద్దవోలు గ్రామాలలో చెరో రూ.23.94 లక్షలతో నిర్మించిన మూడు రైతు భరోసా కేంద్రాలను, ఉద్దవోలులో రూ.20.80లక్షలతో నిర్మించిన ఒక వెల్‌నెస్ భవనాన్ని వెరసి ఆరు భవనాలను ఆమె గురువారం ప్రారంభించారు. ఆయా గ్రామాలలో ప్రారంభోత్సవం అనంతరం స్థానిక ప్రజలతో సమావేశమైన ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాక ముందు ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నారు. ప్రజల ముంగిటకే ప్రభుత్వ పరిపాలనను తీసుకువస్తానని, నేరుగా ప్రతి ఇంటికి సేవలు అందిస్తానని చెప్పి సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థలను తీసుకువచ్చారన్నారు.

ప్రతి పంచాయతీ పరిధిలో కోట్లాది రూపాయలు నిధులు వెచ్చించి ప్రభుత్వ భవనాలను నిర్మించి ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలను తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్రంలో సుపరిపాలనను అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. ఎమ్మెల్యే పుష్పశ్రీవాణిని ఆయా గ్రామాల్లో ప్రజలు ఘనంగా సత్కరించారు. ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, స్థానిక సర్పంచ్‌లు ఎం.నారాయణమ్మ, ఎం.తవిటినాయుడు, నాయకులు తెర్లి ఎల్లంనాయుడు, అంబటి గౌరునాయుడు, బాణాల సురేష్‌కుమార్, ద్వారపురెడ్డి ధనుంజయరావు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సెక్రటరీలు, ఉద్యోగులు, స్థానికులు పాల్గొన్నారు.



పెద్దూరులో నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి